సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



గంజాయి నిర్మూలనకు కృషి

గంజాయి నిర్మూలనకు అందరూ సంయుక్తంగా కృషి చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. 8లో



ఘనంగా కల్యాణోత్సవం

పాడేరులో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 8లో



స్వర్ణ తులసీదళార్చన

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

మంచు.. తగ్గేదేలే



రాజుపాకలు సమీపంలో కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లాలో మంచు ప్రభావం తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటలు దాటినా మంచుతెరలు వీడడం లేదు. దీంతో వాహనచోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజుకో విధంగా హెచ్చుతగ్గులతో ఉంటున్నాయి. జి.మాడుగులలో 9.7 డిగ్రీలు, అరకులోయలో 9.8 డిగ్రీలు, జీకే వీధిలో 9.9 డిగ్రీలు,డుంబ్రిగుడలో 10.2 డిగ్రీలు, పెదబయలులో 10.8 డిగ్రీలు,హుకుంపేటలో 11.0 డిగ్రీలు,పాడేరులో 11.3 డిగ్రీలు,ముంచంగిపుట్టులో 12.4 డిగ్రీలు, చింతపల్లిలో 12.5 డిగ్రీలు, అనంతగిరిలో 15.1 డిగ్రీలు, కొయ్యూరులో 17.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గంలో మరో ముగ్గురికి స్థానం

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గంలో అరకులోయ నియోజకవర్గానికి చెందిన మరో ముగ్గురు నేతలకు స్థానం కల్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తిరి రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తాంగుల త్రినాథ్,అధికార ప్రతినిధిగా కొర్రా గాసీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నడిరోడ్డుపై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



దూసరపాము వద్ద ప్రయాణికులను మరో బస్సులోకి ఎక్కిస్తున్న కండక్టర్

రాజవొమ్మంగి: మండలంలో ఒకే రోజు రెండు ఆర్టీసీ బస్సులు వేర్వేరు కారణాలతో నడిరోడ్డుపై నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందికి గురయ్యారు. నర్సీపట్నం నుంచి కాకినాడ వెళ్లే ఆర్టీసీ బస్సు సోమవారం సాయంత్రం మండలంలోని దూసరపాము వద్ద సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. ఈ బస్సు ఏలేశ్వరం డిపోకు చెందింది. ఇందులో ప్రయాణిస్తున్న 40 మంది గంటపాటు రోడ్డుపై పడిగాపులు కాయవలసి వచ్చింది. అదే మార్గంలో వెళుతున్న మరో బస్సులోకి ప్రయాణికులను ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపారు. రాజమహేంద్రవరం నుంచి నర్సీపట్నం వెళుతున్న రాజమహేంద్రవరం డిపోకు చెందిన బస్సు బ్యాక్ టైర్ పంక్చర్ కావడంతో సోమవారం చాలా సేపు రాజవొమ్మంగిలో నిలిచిపోయింది. ప్రయాణికులు బస్సు వద్ద చాలాసేపు పడిగాపులు కాయవలసి వచ్చింది. మన్యం ప్రాంతానికి పూర్తి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని గిరిజన ప్రతినిధులు కోరారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



మిషన్ల పంపిణీ చేస్తున్న అధికారులు

మోతుగూడెం: స్థానిక సీఆర్‌పీఎఫ్ క్యాంపులో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా 11 మంది నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. వారం రోజుల పాటు 11 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ డి.ప్రకాష్, ఎస్‌ఐ శివనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో 'ఏకలవ్య' హాల్‌టికెట్లు

డుంబ్రిగుడ: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని డుంబ్రిగుడ ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్‌సింగ్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

శివం... సుందరం



మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం

- శివరాత్రి ఉత్సవాలకు శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- మత్స్యగుండంలో నేటి నుంచి భారీ ఎత్తున జాతర
- గుండంలో మత్స్యాలే దేవతలు

శివరాత్రి ఉత్సవాలకు జిల్లాలో శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఎంతో ప్రాధాన్యం ఉన్న హుకుంపేట మండలంలోని మత్స్యగుండం, రంప చోడవరం మండలంలోని రంప తదితర క్షేత్రాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం, ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో జరిగే ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో విస్తృత ఏర్పాట్లు చేశారు.

సాక్షి,పాడేరు: తెలుగు రాష్ట్రాలతో పాటు,ఒడిశా మధ్యప్రదేశ్,ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో పేరొందిన హుకుంపేట మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం మత్స్యగుండం శివరాత్రి జాతరకు ముస్తాబైంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ,ఉత్సవ కమిటీలు విస్తృతంగా ఏర్పాట్లు చేశాయి.జిల్లాలో ఆధ్యాత్మిక,పర్యాటక ప్రాంతంగా మత్స్యగుండానికి ఎంతో గుర్తింపు ఉంది. ఉత్తర వాహిని అయిన ఈ గుండంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. మత్స్యగుండంలోని బండరాళ్ల మధ్య ఉన్న మత్స్యాలను మత్స్యదేవతలుగా గిరిజనులు పూర్వం నుంచి కొలుస్తున్నారు. గుండంలో ముర్రీలు,అటుకులు, శనగపప్పు,చిన్న సైజు కొబ్బరి ముక్కలను సమర్పించి, మనస్ఫూర్తిగా ధ్యానిస్తే మత్స్యాలు దర్శనమిస్తాయి. మత్స్యగుండం ఎగువన మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం వద్ద, సమీపంలోని నాగదేవత కొలువుదీరిన పుట్ట వద్ద కూడా భక్తులు పూజలు చేస్తారు. శివరాత్రి నాడు ఇక్కడ భారీ ఎత్తున జరిగే జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి గిరిజనులు,గిరిజనేతర భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు.

బొర్రా గుహల వద్ద విస్తృత ఏర్పాట్లు

అనంతగిరి(అరకులోయటౌన్): ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి మండలంలోని బొర్రా గుహలలో కొలువైన శివలింగం వద్ద మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 26న ప్రత్యేక పూజల నిర్వహణకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా శివరాత్రి నాడు వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలివచ్చి, గోస్తనీ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తారు.

పాడేరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు


మత్స్యగుండం జాతరకు పాడేరు ఆర్టీసీ డిపో నుంచి 25 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడపనున్నారు. పాడేరు,చింతపల్లి, అరకులోయ, జోలాపుట్టు రూట్‌ల నుంచి ఈ సర్వీసులు ఈనెల 25వ తేదీ సాయంత్రం నుంచి నడుస్తాయి. 26,27 తేదీల్లో పూర్తిస్థాయిలో ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి.

విస్తృతంగా ఏర్పాట్లు

హుకుంపేట మండలం మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంత కుమారి అధ్యక్షతన నూతన ఉత్సవ కమిటీ ఇటీవల ఏర్పాటైంది. ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మినుముల గోపాల పాత్రుడు,పాంగి మత్స్యకొండబాబు, కమిటీ సభ్యులు,స్థానిక గిరిజనులు ఉత్సవాలకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు.భక్తుల విరాళాలతో మత్స్యలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పలు సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చారు. ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను పాడేరుకు చెందిన పద్మావతి జ్యూయలర్స్ అధినేత నవర శ్రీనివాసరావు, పద్మావతి దంపతుల ఆర్థికసాయంతో రూపొందించి, ఆవిష్కరించారు.ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, పందిళ్లు,క్యూలైన్ల నిర్మాణ పనులు చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కమిటీ ఏర్పాట్లు చేసింది. సెలయేరులోని స్నానాల ఘాట్ వద్ద భద్రత చర్యలు చేపట్టాలని,నేవీకి చెందిన గజ ఈతగాళ్లను మూడు రోజులు అందుబాటులో ఉంచాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని జిల్లా అధికార యంత్రాంగం ఆదేశించింది. ఉత్సవాల మూడు రోజులు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. పోలీసుశాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది.



మత్స్యగుండంలోని మత్స్యదేవతలు



మత్స్యదేవతలు దర్శనమిచ్చే మత్స్యగుండం సెలయేరు

మూడు రోజుల జాతర

- మత్స్యగుండంలో ఈనెల 25వతేదీ మంగళవారం ఉదయం 5గంటల నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మూడురోజుల జాతరను ప్రారంభిస్తారు.
- 26వ తేదీన శివరాత్రి నాడు వేకువజాము నుంచే మత్స్యలింగేశ్వరస్వామి దర్శనాలు ప్రారంభమవుతాయి. మత్స్యగుండంలో మత్స్యదేవతల దర్శనానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు మఠం గ్రామం నుంచి పార్వతీ సమేత మత్స్యలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను మత్స్యగుండం క్షేత్రం వరకు ఊరేగిస్తారు.రాత్రి 8గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు.

ఉత్సవాల చివరిరోజైన 27వతేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.





మత్స్యలింగేశ్వరస్వామి

బండరాయిలో విశ్వనాథుడు

వై.రామవరం: మండలంలోని గురమంద అటవీ ప్రాంతంలో బండరాయి రంధ్రంలో కొలువైన విశ్వనాథుడు భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నాడు. మండల కేంద్రం వై.రామవరానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీప్రాంతంలో గురమంద కొండల నడుమ ఉన్న ఈ ఆలయం వద్ద మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడురోజుల పాటు భారీ ఎత్తున జాతర నిర్వహించనున్నారు. ఈ జాతరకు 25 వేల మందికి పైగా భక్తులు హాజరవుతారు. రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లాల నుంచి ఇక్కడకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఏలేశ్వరం డిపో నుంచి పది ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

మహాశివరాత్రి ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సీఐ బి.నరసింహమూర్తి, ఎస్‌ఐ బి.రామకృష్ణల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు. భక్తులకు తాగునీరు తదితర సౌకర్యాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తోంది.

ప్రత్యేకతలెన్నో..

- ఆలయం ఎదుట గల సెలయేరు మండు వేసవిలో సైతం జీవనదిలా పారుతూ ఉంటుంది. ఇది విశ్వనాథుని మహిమల్లో ఒకటని ఆ ప్రాంతవాసుల నమ్మకం.
- ఆలయం ఎదుట ఏటి ఒడ్డున ఉన్న పూలచెట్టు మహాశివరాత్రి రోజున మాత్రమే తెల్లని, ఎర్రని పూలు పూస్తుంది. మరుసటి రోజు పూలు రాలి పోవడం స్వామివారి మహిమగా భక్తుల విశ్వాసం.

సంతాన నందులు

సంతానంలేని దంపతులు ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు నంది విగ్రహాల వద్ద మహాశివరాత్రి ముందు రోజు రాత్రి నిష్ఠతో జాగరణచేసి, ఉదయాన్నే స్నానం చేసి, విశ్వనాథుని దర్శించుకుని, ఆ నందులను ఎత్తుకుని ఒడిలో పెట్టుకుంటే సంతానం కలుగుతుందని ఈ ప్రాంతవాసుల నమ్మకం.

- పాము పడగ ఆకారంలో గల కొండ మధ్యలో బండరాయికి ఉన్న రంధ్రంలో ఉన్న శివలింగంపైన ఏడాది పొడవునా చుక్క చుక్క నీరు పడడం విశ్వనాథుని మహిమల్లో ఒకటిగా చెబుతుంటారు.




గురమందలో శివలింగం

సర్వదోషాలు హరించే దివ్య క్షేత్రం రంప

రంపచోడవరం: సర్వదోషాలు హరించే దివ్య క్షేత్రంగా మండలంలోని రంప శివాలయం వెలుగొందుతోంది. ఏటా మహాశివరాత్రి నాడు జిల్లాలో పలు ప్రాంతాల నుంచే కాకుండా మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఇక్కడి భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26 నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని అంచనా. రంప శివాలయాన్ని, అక్కడ ఉన్న సర్ప శిలను దర్శించుకుంటే సర్వదోషాలు పోతాయని భక్తుల నమ్మకం. అల్లూరి సీతారామరాజు మన్యంలో బ్రిటిష్ వారిపై పోరాటం చేస్తున్న సమయంలో ఒకసారి రంప గ్రామంలోని శివాలయాన్ని దర్శించుకున్నట్టు చెబుతారు. మహాశివరాత్రి నాడు రాత్రి 7 గంట నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహిస్తారు.రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన శివపార్వతుల పంచలోహ విగ్రహాలను ప్రతి ఏటా మహాశివరాత్రి ముందు రోజు ఊరేగింపుగా రంప గ్రామానికి తీసుకు వెళతారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగిసిన తరువాత ఆ విగ్రహాలను తిరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించి భద్ర పరుస్తారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు: రంపలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు డీఎస్పీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఆర్టీసీ సర్వీసులు నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.



రంప శివాలయం

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను ఈనెల 27న ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పీవో, ఏపీవో,ఓపీవో,రూట్,సెక్టోరల్ అధికారులు,ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు కేవలం పోలింగ్ సరళికే పరిమితం కాకుండా ఇతర వ్యక్తులు పోలింగ్ కేంద్రం పరిధిలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, పోలీసు బందోబస్తు, క్యూలైన్లను పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లు మొబైల్ ఫోన్లు తీసుకురాకుండా మిగిలిన ఎన్నికల సిబ్బంది చూడాలని,సమస్యలు ఎదురైతే పోలీసు, రూట్,సెక్టోరల్ అధికారుల సహాయం తీసుకోవాలన్నారు.ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా పాటించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సులకు ఏజెంట్ల సమక్షంలోనే సీళ్లు వేయాలని తెలిపారు. రూట్,సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన రూట్లలో అందుబాటులో ఉండి,పోలింగ్ సిబ్బందికి అవసరమైన మెటీరియల్‌ను అందించాలన్నారు. మారుమూల ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. వెబ్‌కాస్టింగ్‌ను జిల్లా కేంద్రం నుంచే పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. శిక్షణ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్,డీఆర్వో పద్మలత,ఎస్‌డీసీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

రంపచోడవరం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు.స్థానిక వైటీసీలో 12 పోలింగ్ కేంద్రాలకు చెందిన సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు.శిక్షణ కార్యక్రమంలో పీవో మాట్లాడుతూ పీవో, ఏపీవోలు,ఓపీవోలకు ఎన్నికల నిర్వహణపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. సబ్‌కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు నుంచి సాయంత్రం 4 గంటలకు పోలింగ్ జరుగుతుందని, ఈ నెల 26న ఎన్నిక సిబ్బంది రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ అంబేద్కర్, తహసీల్దార్ పి.రామకృష్ణ, డీటీ సత్యనారాయణ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గంజాయి' వాహనాల వేలం

అరకులోయ టౌన్: ఎక్సైజ్, గంజాయి కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 25వ తేదీ మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ సంతోష్ సోమవారం తెలిపారు. తొమ్మిది వాహనాలకు వేలం వేస్తున్నామని, ఆసక్తి గల వారు మంగళవారం ఉదయం 10 గంటలకు అరకులోయ పద్మాపురం జంక్షన్ వద్ద గల ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్‌కు వచ్చి రూ. 5వేల రిఫండబుల్ ఫీజు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని చెప్పారు. వేలం పాటను వాయిదా వేసేందుకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులకు పూర్తి హక్కులు ఉన్నాయని సీఐ తెలిపారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

జేసీ,ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో డాక్టర్ అభిషేక్‌గౌడ

సాక్షి,పాడేరు: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్,ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఎం.జె. అభిషేక్‌గౌడ హెచ్చరించారు. ఐటీడీఏ సమావేశమందిరంలో సోమవారం పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల ఏటీడబ్ల్యూవోలు,హెచ్‌ఎంలు,గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్‌లో మంచి ఫలితాలు రావాలన్నారు. మాస్‌కాపీయింగ్‌ను ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇంతవరకు 10 ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశానని,సాయంత్రం 5గంటల సమయంలో ఉపాధ్యాయులు ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.స్టడీ అవర్‌లో సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండడం లేదన్నారు.ఫ్రెంచ్ విప్లవం గురించి అడిగితే టెన్త్ విద్యార్థులు జవాబు చెప్పలేకపోతున్నారని చెప్పారు. కొంతమంది ఉపాధ్యాయులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తెలిపారు.మెనూ సక్రమంగా అమలుచేయాలని ఆదేశించారు.విద్యార్థులకు రాగిమాల్ట్‌ను అందజేయడం లేదని చెప్పారు. ఎంఈవోలు ఆశ్రమ పాఠశాలలు,గురుకుల విద్యాలయాలను తనిఖీ చేసి, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలపై హెచ్‌ఎంలు వారానికి ఓసారి ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో సఖీ గ్రూప్‌లు ఏర్పాటు చేశామని,సమావేశాలు నిర్వహించి విద్యార్థినుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత సమస్యలు,బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు,ఇన్‌చార్జి డీడీ రజనీ,ఏపీసీ స్వామినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ

వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎంగా లలిత్ బోరా




తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎంగా లలిత్ బోరా సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారైన లలిత్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఐఐటీ బొంబాయి నుంచి బీటెక్, బిట్స్ పిలానిలో ఎంబీఏ పూర్తి చేశారు. రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్, చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్, చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా గతంలో పనిచేశారు. వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎంగా పనిచేసిన సౌరబ్ ప్రసాద్ సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారు. అప్పటి నుంచి ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ డీఆర్‌ఎంగా ఉన్నారు.లలిత్‌బోరాను డీఆర్‌ఎంగా డిసెంబర్ 26న నియమించగా సోమవారంబాధ్యతలు చేపట్టారు.

గిరిజనులకు ద్రోహం చేస్తే సహించం

పోలవరం ఎమ్మెల్యే బాలరాజుకు ఆదివాసీ జేఏసీ హెచ్చరిక

సాక్షి,పాడేరు: గిరిజనులకు ద్రోహం చేస్తే సహించేది లేదని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర హెచ్చరించారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ ద్వారా పదవి పొందిన పోలవరం ఎమ్మెల్యే గిరిజన ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌టీఆర్ కేసులు పెట్టిన ఆదివాసీలపై గిరిజనేతరులతో కలిసి ఎమ్మెల్యే ఎదురు కేసులు పెట్టి జాతి ద్రోహానికి పాల్పడుతున్నారని చెప్పారు. గిరిజన చట్టాలను కాపాడాల్సిన ఎమ్మెల్యే దోపిడీ వర్గాల చెంతకు చేరడం దారుణమన్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను తీసివేయడానికి పూనుకున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజును ఆదివాసీ జేఏసీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ స్పందించి పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు.ఎమ్మెల్యేపై ఏలూరు కలెక్టర్ విచారణ జరిపాలని కోరారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా ఎమ్మెల్యే.. గిరిజన వ్యతిరేక విధానాలపై స్పందించాలన్నారు.మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కూడా గిరిజన జాతికి ద్రోహం చేస్తున్నారని, కొయ్యూరు మండలంలోని గిరిజనేతరులకు భూమి పట్టాలు ఇవ్వాలని ఉన్నతాధికారులకు లేఖలు రాయడం అన్యాయమన్నారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సుర్ల అప్పారావు,జేఏసీ మండల నేతలు సురేష్,బాబూజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావుదొర

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వాహనాల తనిఖీలు

గంగవరం: మండల కేంద్రంలో సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఏర్పాటుచేసిన ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి, ప్రయాణికుల బ్యాగులను సోదా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి మల్లేశ్వర రావు తదితరులున్నారు.

వుషూలో సత్తాచాటిన చెట్టుపల్లి విద్యార్థినులు

నర్సీపట్నం: రాజమహేంద్రవరంలో రెండు రోజుల పాటు జరిగిన వుషూ స్టేట్ టోర్నమెంట్‌లో చెట్టుపల్లి హైస్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థినులు పతకాలు సాధించారు. పోటీల్లో 18 మంది పాల్గొనగా, 12 మంది పతకాలు సాధించారని కోచ్ వేపాడ ప్రియాంక, సీనియర్ కోచ్ శేఖర్ తెలిపారు. ప్రియాంక గోల్డ్ మెడల్, కిరణ్మయి, నీలిమ సిల్వర్, తనుశ్రీ, హరణ్యశ్రీ, చాందిని, యశస్విని, పూజిత, మాధురి, సామ్యశ్రీ వర్షిత, అంకిత, సత్యదుర్గ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని స్పీకర్ సతీమణి, కౌన్సిలర్ పద్మావతి, కౌన్సిలర్ రాజేష్ అభినందించారు.

విశాఖకు మల్లన్న తలపాగా



అల్లిపురం: సంప్రదాయ ఉత్సవాలలో భాగంగా శ్రీశైలంలో పాగా దర్శనానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ దర్శనం ముక్తిదాయకమని వేద పండితులు చెబుతుంటారు. మల్లన్న తలపాగా ధారణ చూసి తరించేందుకు లక్షల మంది భక్తులు అక్కడికి చేరుకుంటారు. మహాశివరాత్రి నాడు అర్ధరాత్రి లింగోద్భవం తర్వాత.. భక్తులు పెద్దసంఖ్యలో మల్లన్న పాగా దర్శించుకుంటారు.

దిగంబరంగ ఆలయ శిఖరం నుంచి నవనందులకు చేనేత వస్త్రాన్ని తలపాగా ధరింపజేసే మహాభాగ్యం ఉత్తరాంధ్ర జిల్లాలకు కలగడం అదృష్టంగా భావించవచ్చు. ఆ అదృష్టం విజయనగరం జిల్లా పెనుబాక గ్రామానికి చెందిన ఆశపు రవణ దంపతులతో పాటు సంతకవిటి మండలం మందరాడకు చెందిన ముతికి వీర్రాజు దంపతులకు కలగడం విశేషం. ఈ మేరకు వారు విజయనగరం కలెక్టర్ ద్వారా అనుమతి తీసుకుని పాగాను నేశారు.

భక్తి శ్రద్ధలతో..

వైకుంఠ ఏకాదశి రోజున ప్రారంభించిన పాగా నేతను ముక్కనుమ రోజు నుంచి సిద్ధం చేస్తారు. అప్పటి నుంచి కఠిన నియమ నిష్ఠలతో నిత్య శివనామస్మరణతో మాలధరించి, పూజలు నిర్వహిస్తూ ఈ తలపాగాను తయారు చేస్తారు. తెల్లని వస్త్రాన్ని నియమ నిష్ఠలతో సంవత్సరానికి 365 రోజులకు గాను రోజుకు మూర చొప్పున 365 మూరలు వస్త్రాన్ని నేయడం విశేషం. అనంతరం పాగా మొత్తాన్ని శివలింగం ఆకారంలో చుట్టి, విశేషంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భజనలు చేపడతారు.



పెనుబాక నుంచి వచ్చిన పాగాతో శివ భక్తుడు అప్పలనాయుడు, పాగా నేసిన నేతన్నలు, భక్తులు

అల్లిపురం చేరిన పాగా

అలా నియమ నిష్ఠలతో తయారు చేసిన పాగాను విశాఖలో అల్లిపురం, బృందావన్ జంక్షన్ వద్ద గల ప్రముఖ శివ భక్తుడు పీలా వెంకట చిన అప్పలనాయుడు ఇంటికి ఆదివారం ఒకటి, సోమవారం ఒకటి చేరుకున్నాయి. వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నగరంలో పలు ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం శ్రీశైలం తరలించన్నారు.

వైకుంఠ ఏకాదశి నుంచి



వైకుంఠ ఏకాదశి నుంచి పాగా నేత ప్రారంభించాం. అప్పటి నుంచి ఏడాదిలో 365 రోజులకు గాను 365 మూరల పాగాను అల్లాం. నేత పూర్తయిన తరువాత ఇంట్లో ప్రత్యేక పూజలు చేపట్టాం. శివ భక్తుల కోరిక మేరకు విశాఖ తీసుకువచ్చాం. ప్రతి ఏడాది ఇదే విధంగా చేసి శ్రీశైలం తీసుకువెళ్తుంటాం. ఇది శివయ్య మాకు ఇచ్చిన అద్భుత అవకాశం.

–ఆశపు రమణ, పునుబాక, విజయనగరం

మా పూర్వ జన్మ సుకృతం



45 రోజుల పాటు కష్టపడి చేతితో నేసిన పాగా. శివయ్య ఆదేశం మేరకు ప్రతి ఏడాది పాగా నేసి శ్రీశైలం తీసుకువెళుతుంటాం. ఈ ఏడాది ఇద్దరికి అనుమతులు ఇచ్చారు. పాగాను నేయడం మా పూర్వ జన్మఫలంగా భావిస్తున్నాం. నియమ నిష్ఠలతో పూజలు చేసి నేత నేశాం. ప్రతి ఏడాది విశాఖ తీసుకువచ్చి, ఇక్కడ నుంచి శ్రీశైలం వెళ్తుంటాం.

– ముతుకుటి వీర్రాజు దంపతులు, మందరాడ, విజయనగరం

నాలుగేళ్లుగా..



నాలుగేళ్లుగా విజయనగరం జిల్లా పెనుబాకలో నేత నేసిన పాగాను అల్లిపురంలో మా ఇంటికి తీసుకువస్తాం. ఇక్కడ పూజలు చేసిన అనంతరం ఆలయానికి తరలిస్తాం. విశాఖలో శివయ్య భక్తులు దర్శించుకున్న అనంతరం పాగాను ప్రత్యేక వాహనంలో శ్రీశైలం తరలిస్తాం. అక్కడ దేవస్థానం కార్యాలయంలో అప్పగించిన అనంతరం శివరాత్రి రోజున లింగోద్భవ కాలంలో నిరాకారుడైన ఆ మహాదేవుడ్ని స్మరిస్తూ శ్రీశైలం ఆలయం శిఖరం నుంచి నవనందులకు తలపాగా చుడతారు. ఆ అదృష్టం మాకు కలగడం చాలా ఆనందంగా ఉంది.

– పీలా వెంకట చిన అప్పలనాయుడు, శివ భక్తులు, అల్లిపురం

మత్స్యగుండం జాతరకు పూర్తి ఏర్పాట్లు

జేసీ అభిషేక్ గౌడ ఆదేశాలు



మత్స్యగుండంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

హుకుంపేట: మత్స్యగుండం మహాశివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ ఆదేశించారు. జాతరలో ఎటువంటి అవంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రత చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం మత్స్యగుండం మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మత్స్యలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అవసరమైన పారిశుధ్య సిబ్బందిని నియమించి మూడు రోజుల పాటు మెరుగైన పనులు చేపట్టాలని తెలిపారు. జాతరలో మూడు రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిరంతరం వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ మఠం శాంతకుమారి, అప్పారావు, ఉత్సవ కమిటీ అధ్యక్ష , కార్యదర్శులు పాంగి కొండబాబు, గోపాలపాత్రుడు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం



పాడేరు పట్టణంలో సారెను ఊరేగిస్తున్న పద్మశాలి కుటుంబాలు



ఉమానీలకంఠేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.శివరాత్రి మూడు రోజుల ఉత్సవాలు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవానికి మోదకొండమ్మతల్లి ఆలయం నుంచి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పద్మశాలి కుటుంబాలు పట్టణంలో సారె ఊరేగింపు జరిపాయి.పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.రాత్రి స్వామి వారి కల్యాణాన్ని అర్చకుడు రామం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో గంజాయి నిర్మూలనకు అందరూ సంయుక్తంగా కృషి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది 208 గంజాయి కేసులు నమోదు చేసినప్పటికీ ఇంకా మారుమూల ప్రాంతాల్లో గంజాయి సాగు జరుగుతోందని, నియంత్రణకు పోలీసు,ఎక్సైజ్,అటవీశాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుశాఖ డ్రోన్ల సాయంతో 274 గ్రామాలను పరిశీలించి,సుమారు 82 ఎకరాలలో గంజాయి తోటలను ధ్వంసం చేసిందన్నారు.గంజాయి సాగుతో ఏర్పడే అనర్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించి,ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు.డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు, వ్యాపారాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.చిన్నచిన్న వ్యాపారాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు.మత్తుకు బానిసలైన వారికి విముక్తి కల్పించాలని, విద్యాలయాల్లోను గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ,ఏఎస్పీ ధీరజ్,అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషి



చిన్నారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కో-కన్వీనర్ విశాలాక్షి

సాక్షి,పాడేరు: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులంతా బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు వారికి క్రమశిక్షణతో కూడిన చదువులకు చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కో–కన్వీనర్ చిత్రా విశాలాక్షి పిలుపునిచ్చారు. మండలంలోని డల్లాపల్లి గ్రామాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఇక్కడ ఆదివాసీ బాలబాలికలు,వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యకు ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. బడికి దూరంగా బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. టెన్త్, ఇంటర్‌తోనే చదువులు నిలిపివేయకుండా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపైన ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు .గ్రామాల్లో బాల బాలికలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. . ధాత్రి ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ దీనబంధు, ఆస్క్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అబ్దుల్ మునీర్ ముషాద్, స్పందన స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు బషీరున్నీసా, గ్రామపెద్ద భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో మైనర్ అరెస్ట్

నర్సీపట్నం: మండలంలోని మెట్టపాలెం గ్రామంలో జనవరి 16న జరిగిన చోరీ కేసులో మైనర్‌ను అరెస్టు జువెనైల్ హోమ్‌కు తరలించామని రూరల్ ఎస్సీ రాజారావు తెలిపారు. మైనర్ నిందితుడు అదే గ్రామానికి చెందిన ఎ.వరలక్ష్మి ఇంట్లో చోరీకి పాల్పడి మూడు సెల్‌ఫోన్లు, రూ.14 వేలు కాజేసినట్లు రుజుకావడంతో కేసు నమోదు చేసి, జువెనైల్ హోమ్‌కు తరలించామన్నారు.

మృతదేహంతో బంధువుల ఆందోళన

- చేయని నేరానికి బాధ్యుడ్ని చేయడంతో ఆనంద్ మృతి
- గోపాలపట్నం పోలీసు స్టేషన్ వద్ద బైఠాయింపు
- న్యాయం చేస్తామని పోలీసుల హామీ



గోపాలపట్నం పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

గోపాలపట్నం : చేయని నేరానికి తరచూ పోలీసు స్టేషన్‌కు పిలుస్తున్నారని మనస్తాపం చెందిన ఆనంద్ ఆదివారం బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. తప్పుడు కేసు పెట్టి మానసిక వేదనకు గురిచేయడం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు, వారి బంధువులు సోమవారం గోపాలపట్నం పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఆదివారం ఆనంద్ మృతి చెందగా..సోమవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వారు నేరుగా మృతదేహాన్ని గోపాలపట్నం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి ఆందోళన నిర్వహించారు. గత ఏడాది జరిగిన సంఘటనకు ఏమాత్రం సంబంధం లేని ఆనంద్‌ను తరుచూ పోలీసు స్టేషన్‌కు పిలిపించి దొంగగా ముద్ర వేడయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని, తమకు న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ సందర్భంగా సీఐ గొలగాని అప్పారావు, ఎస్ఐ అప్పలనాయుడు బాధితులతో చర్చించారు. విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. ఆందోళన కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

బాధిత గిరిజన మహిళకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

పాడేరు రూరల్: హుకుంపేట తహసీల్దార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుని గిరిజన మహిళ గంపరాయి బాలప్రభకు న్యాయం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. గిరిజన మహిళ బాలప్రభకు చెందిన స్థలం ఆక్రమించుకుని గిరిజనేతరుడైన మహ్మద్ ఆలీ, ఆసిన్ బేగంలు నిర్మాణాలు చేసుకున్నారన్నారు. దీనిపై న్యాయం చేయాలని గత 24 రోజుల పాటు న్యాయ పోరాటం చేసిన ఓ గిరిజన మహిళకు న్యాయం చేయాల్సి పోయి తహసీల్దార్ గిరిజన చట్టలకు విరుద్ధంగా గిరిజనేతరుడికి సహకరించడం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారుల తప్పిదాలతోనే ఎంతో మంది గిరిజనులు అన్యాయాలకు గురవుతున్నారని తెలిపారు. గిరిన మహిళ చంటి బిడ్డను పట్టుకుని న్యాయం చేయాలని వేడుకుంటుంటే గిరిజనేతరులకు కొమ్ముకాయడంలో ఆంతర్యం ఏమిటన్నారు. తక్షణం అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. ఈ సంఘటనపై పాడేరు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నస్వామి, భాను, లింగమూర్తి, రాజబాబు పాల్గొన్నారు.

అదనపు కట్నం ఇవ్వలేదని కుల బహిష్కరణ!

- కలెక్టరేట్ వద్ద బాధితుల నిరసన
- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన
- కోడ్ ఉందని కలెక్టర్ వద్దకు అనుమతించని పోలీసులు



కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై చర్యలు కోరుతూ నిరసన తెలుపుతున్న బాధితులు

తుమ్మపాల : అదనపు కట్నం ఇవ్వలేదని, విడాకులకు అంగీకరించలేదని అక్కసుతో కులపెద్దల సమక్షంలో పెట్టి జిల్లా నుంచి కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పట్టణంలో దొమ్మరి సామాజికవర్గానికి చెందిన అనపరెడ్డి భువనేశ్వరి అనే గృహిణి తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపింది. బాధితురాలు తెలిపిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా, రాజానగరానికి చెందిన తన భర్త అనపరెడ్డి సాయితో పాటు అత్త సావిత్రి, బావ పాపారావు అదనపు కట్నం కోసం తనను తీవ్రంగా వేధిస్తున్నారని, గర్భవతిగా ఉన్నప్పుడు అనకాపల్లి పంపించారని, బిడ్డ పుట్టిన తర్వాత డబ్బు తీసుకునే రావాలని వేధించడంతో గత ఏడాది ఆగస్టులో అనకాపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు తెలిపింది. దీంతో పోలీసు కేసు పెట్టి తప్పు చేశావంటూ కొందరు పెద్ద మనుషులు తమను కుల బహిష్కరణకు ఆదేశించారని ఆవేదన వ్యక్తం చేసింది. రాజానగరానికి చెందిన నెల్లూరు నాగేశ్వరరావు, రెడ్డి అప్పరాజు (మారేడుపూడి), అనకాపల్లి జిల్లాకు చెందిన పసుపులేటి శ్రీను, అమరశెట్టి అప్పారావు, అనపరెడ్డి శ్రీను, రెడ్డి అన్నవరం, పసుపులేటి సూరిబాబు అనే వ్యక్తులు కుల పంచాయతీపెట్టి తమకు రెండు లక్షలు జరిమానా విధించి తమ తల్లిదండ్రుల నుంచి లక్ష రూపాయలు వసూలు చేశారని తెలిపారు. తనతో పాటు తన బిడ్డ, తల్లిదండ్రులు ఎవరితోను మాట్లాడకూడదని, ఎట్టి శుభకార్యాలకు వెళ్లకూడదని, ఎవరైనా తమను పిలిస్తే వారికి రూ.10 వేలు జరిమానా చెల్లించాలని ఆదేశించారని, బంధువులను దూరం చేసి తమను తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తున్నారని తెలిపారు. కులబహిష్కరణపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు స్పందించలేదన్నారు. తమను కుల బహిష్కరణ చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే తమకు ఆత్మహత్యే గతి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయకుండా పోలీసులు ఎన్నికల కోడ్ అంటూ కలెక్టరేట్ లోపలికి అనుమతించకపోవడం పట్ల తీవ్ర ఆవేదన చెందారు.

గల్లంతైన గిరిజనుడి కోసం గాలింపు



జలంధర్ కోసం మత్స్యగెడ్డలో నాటు పడవలపై గాలిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: గొడుగులపుట్టు–సిరగంపుట్టు గ్రామాల మధ్యలోని మత్స్యగెడ్డలో ఆదివారం గల్లంతైన గిరిజనుడు జలంధర్(44) కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బీట, గొడుగుటపుట్టు గ్రామాలకు చెందిన గిరిజనులు నాటు పడవలతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మరంగా గాలించారు. అయినా ఆయన జాడ కానరాలేదు. గిరిజనుడి గల్లంతుపై స్థానిక సర్పంచ్ రమేష్, కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులకు, పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్‌వో భాస్కర్, రెవెన్యూ సిబ్బంది మత్స్యగెడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులకు అడిగి ప్రమాదం గల కారణాలను తెలుసుకున్నారు. నాటు పడవకు రంధ్రం ఉండడంతో నీరు లోపలికి ప్రవేశించి, పడవ మునిగి గల్లంతైనట్లు స్థానికులు అధికారులకు తెలియజేశారు. మత్స్యగెడ్డలో నీటి నిల్వ అధికంగా ఉండడంతో గాలింపు కోసం గిరిజనులు సైతం భయాందోళన చెందుతున్నారు. అధికారులు సహాయం చేయాలని కోరుతున్నారు.

కొత్త చింతపండు ధరలు పుల్లన



సంతలో చింతపండు విక్రయాలు

మాడుగుల : అల్లూరి జిల్లా దేవాపురం చింతపండుకు మంచి గిరాకీ ఉంటుంది. సోమవారం జరిగిన మాడుగుల వారపు సంతకు దేవాపురం నుంచి చింతపండు అరకొరగా వచ్చింది. 40 కిలోలున్న కావిడి రూ.4 వేలు ధర పలికింది. గతంలో ఇదే కావిడి రూ.1500 నుంచి రూ.3 వేలు ఉండేది. ఈ ఏడాది చింతపండు దిగుబడి తగ్గడంతో పాటు రవాణా చార్జీలు పెరగడంతో ధరలు పెంచుతున్నామని గిరి రైతులు చెబుతున్నారు. ధరలు పెరగడంతో 12 గంటల వరకు కొనుగోలుదారుల కోసం రైతులు ఎదురు చూడవలసి వచ్చింది.

కొత్త అమావాస్య జాతర రాట ప్రతిష్ట



జాతర రాట మహోత్సవాన్ని నిర్వహిస్తున్న ఉప కమిషనర్ సుజాత, ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర వచ్చే నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎస్.సుజాత తెలిపారు. అమ్మవారి ఆలయ ఆవరణలో జాతర రాట ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం అమ్మవారి బాలాయంలో ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో దేవాలయం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.